## డీసీపీ శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



బండ్లగూడ, జనవరి 5 : రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసుగా చింతమనేని శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పని చేసిన జగదీశ్వర్‌రెడ్డి సీఐడీ విభాగానికి బదిలీపై వెళ్లారు. డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ తమ లక్ష్యమని అన్నారు.

## దీపికకు అభినందనలు



రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్‌లో సీటు సాధించిన ఎం దీపికను రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రష్మీ పెరుమాల్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకొని దానిని అధిరోహించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. -బండ్లగూడ, జనవరి 5 :

## చెస్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు




డీఏవీ స్పోర్ట్స్ నేషనల్ లెవల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా మూడు రోజుల పాటు గురుగాం (హర్యానా)లోని డీఏవీ పబ్లిక్ స్కూల్ నిర్వహించిన అండర్-14 బాలికల విభాగం చదరంగం పోటీల్లో డీఏవీ సౌత్ విద్యార్థులు రజత పతకం సాధించారని కంచన్‌బాగ్ డీఏవీ పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఎస్. ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గౌరీశంకరావు, ఏఆర్‌ఓ వసంత రామన్, కోచ్ కృష్ణ, మేనేజర్ పూజ, ఎల్‌ఎంసీ సభ్యులు పాల్గొన్నారు. -సైదాబాద్, జనవరి 5 :

## పనుల్లో నాణ్యత పాటించాలి



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ శ్రీకాంత్‌రావు

మణికొండ, జనవరి 5 : తాగునీటి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నార్సింగి ఆరో వార్డు కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు తెలిపారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గిరిగిరిగడ్డ కాలనీలో రూ.52 లక్షలతో చేపడుతున్న తాగునీటి పైపులైను పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కొన్నాళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను అధిగమించేందుకు తనవంతుగా మున్సిపాలిటీ సాధారణ నిధుల వెచ్చించి పైపులైను పనులను పూర్తిచేసేందుకు చొరవ చూపుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం



కావేరి (ఫైల్)

శంషాబాద్ రూరల్ : కూరగాయల మార్కెట్‌కు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన శుక్రవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శంకరాపూర్‌కు చెందిన కడ్డాల కావేరి గురువారం ఉదయం 8.30 గంటల సమయంలో శంషాబాద్‌లోని కూరగాయాల మార్కెట్‌కు వెళ్లి వస్తానని చెప్పి సాయంత్రమైన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికిన ఆచూకీ దొరకలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ప్రజాపాలనను వినియోగించుకోవాలి

● మణికొండ, నార్సింగిల్లో కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ శశాంక్ ● దరఖాస్తుల స్వీకరణపై ఆరా

మణికొండ, జనవరి 5 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ సూచించారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ప్రజాపాలన కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారుల నుంచి తీసుకుంటున్న దరఖాస్తులను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అనే విషయాలపై కలెక్టర్ శశాంక్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దరఖాస్తులు చేసేందుకు కేంద్రాల వద్దకు వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. గతంలో రేషన్ కార్డులు ఉన్నా అమలుకు నోచుకోలేక, కొత్తవి రాక, ఇతర పథకాలకు అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. ప్రజలకు మరింతగా అవగాహన కల్పించేందుకు అధికారులు చొరవ చూపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, మున్సిపల్ చైర్మన్లు నరేందర్, రేఖయాదగిరి, వైస్ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, కమిషనర్లు ఫల్గుణకుమార్, సురేందర్‌రెడ్డి, డీఈలు అరుణజ్యోతి, నర్సింహులు పాల్గొన్నారు.




మణికొండలో దరఖాస్తులు స్వీకరించి రశీదును అందజేస్తున్న కలెక్టర్ శశాంక్, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్



పెద్దగోల్కొండలో అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శశాంక్

### పెద్దగోల్కొండలో...

శంషాబాద్ రూరల్, జనవరి 5: ప్రజాపాలనలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ సూచించారు. శుక్రవారం శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో వసంతలక్ష్మి, ఎంపీవో ఉషాకిరణ్, సర్పంచ్ కామెంబాయి లక్ష్మయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికీ రాములోరి అక్షింతలు



మణికొండ లక్ష్మీనగర్ కాలనీలో అక్షింతలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ, జనవరి 5: అయోధ్య శ్రీ రామమందిరం నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షింతలు 4వ రోజు మణికొండ లక్ష్మీనగర్ కాలనీలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాఘవరెడ్డి, మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బీరప్ప, లక్ష్మి కాలనీ మాజీ అధ్యక్షులు మల్లికార్జున్, నాయకులు నరసయ్యాచారి, నర్సింగ్‌రావు, బీరప్ప పాల్గొన్నారు.

### మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో...

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 5: శ్రీరాముడి అక్షింతలు ఎంతో పవిత్రమైనవని ప్రతి ఇంట్లో పూజ గదిలో వీటిని ఉంచవలసిన అవసరం ఉందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జనార్దన్ తెలిపారు. శ్రీరాముడి అక్షింతలు డివిజన్ పరిధిలో ఇంటింటికీ పంపిణీ చేశారు.



లక్ష్మీగూడలో అక్షింతలను పంపిణీ చేస్తున్న నాయకులు

# ఆలయ భూములను కాపాడాలని వినతి



తహసీల్దార్ గోవర్ధన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

మణికొండ, జనవరి 5 : గండిపేట రెవెన్యూ మండల పరిధిలోని ఖానాపురం గ్రామ సర్వేనంబర్ 65లోని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ తహసీల్దారు గోవర్ధన్‌కు ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఖానాపురం సర్వేనంబర్ 65లో దాదాపు 190 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మిగిలిన భూములన్నీ గండిపేట చెరువులోనే ఉన్నాయి. కొంతకాలంగా బడాబాబులు అక్రమంగా న్యాయస్థానాలను పత్రాలు తీసుకువచ్చి వేలకోట్ల విలువచేసే భూములను కబ్జా చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే సర్వేనంబర్ 65లో దాదాపు వందేళ్లక్రితమే ఉన్న పురాతన హనుమాన్ ఆలయానికి సుమారుగా పదిహేను ఎకరాల భూమి ఉందని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్‌యాదవ్, మాచర్ల రాజు,విఠలయ్య, విఠల్‌రెడ్డి, సురేశ్, రాములు, మాజీ ఎంపీపీ మల్లేశ్, బీజేపీ జిల్లా ఓబీసీ మోర్చా దుద్దాల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సింగిల్‌విండో చైర్మన్ క్రిష్ణ, బీజేపీ మండలాధ్యక్షుడు భిక్షపతియాదవ్, నాయకులు ప్రశాంత్‌యాదవ్,మెండే నాగేశ్వోద వ్,నరేశ్ ఉపేందర్,రఘుపతి,విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్, శశికాంత్,సందీప్‌రెడ్డి, సంపత్, పోచయ్య, శంకర్ కుమార్,దుద్దాల మల్లేశ్ తదితరులు ఉన్నారు.

## శంషాబాద్ రూరల్ సీఐగా శ్రీనాథ్

శంషాబాద్ రూరల్, జనవరి 5 : శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐగా శ్రీనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన శ్రీధర్‌కుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో సీఐగా శ్రీనాథ్‌ను సైబరాబాద్ సీపీ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు స్వాగతం రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తానని తెలిపారు.

## గుండె పోటుతో బల్గేరియా దేశస్తుడు మృతి

శంషాబాద్ రూరల్, జనవరి 5 : గుండెపోటులో బల్గేరియా దేశానికి చెందిన సరమోవ్ సెర్గీ జెలెవ్(70) మృతి చెందిన సంఘటన శుక్రవారం శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం.. బల్గేరియా దేశానికి చెందిన సరమోవ్ సెర్గీ జెలెవ్, సరమోవ్ ఆంటోనియా ఇద్దరు 15 రోజుల క్రితం శంషాబాద్ సమీపంలో ఉన్న కన్హాశాంతి వనంలో ధ్యానం చేయడానికి వచ్చారు. అయితే రోజువారీగా శంషాబాద్‌లోని ఓ హోటల్‌లో ఉంటున్నారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో వారిని ప్రత్యేకంగా కేటాయించిన వాహనంలో తీసుకుపోతారు. కాగా వారు రాకపోవడంతో హోటల్‌లో ఉన్న వ్యక్తులు రాలేదని హోటల్ యాజమానికి సమాచారం ఇచ్చారు. హోటల్ నుంచి బయటికి వచ్చే సమయంలో అనారోగ్యానికి గురి కావడంతో వారిని సమీపంలో ఉన్న దవాఖానకు తరలించినట్లు వివరించారు. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఉన్నత విద్యపై దృష్టి పెట్టాలి

సైదాబాద్, జనవరి 5 : సైదాబాద్ మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాల, ఎంవీఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సైదాబాద్ ధోబీఘాట్ చౌరస్తాలోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజ్ ఆవరణలో 'ఉన్నతి (ఎంఈసీఎస్) హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ (2కె24)'ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేపీ శ్రీనివాసరావు, సెక్రటరీ కృష్ణకుమార్, కోశాధికారి జూపూడి సుధాకర్‌తోపాటు మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య, విదేశీ విద్యను అభ్యసించడానికి, ఉద్యోగ అవకాశాలను పొందటానికి మార్గనిర్దేశం చేసేందుకు హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ ఎంతోగానూ దోహదపడుతుందన్నారు.